ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
7
కృష్ణా
జిల్లా వార్తలు
ఆదివారం 19 అక్టోబరు 2025



ప్రపంచ కూచిపూడి దినోత్సవాన్ని పురస్కరించుకుని కూచిపూడి గ్రామంలోని శ్రీసిద్ధేంద్రయోగి కళావేదికపై శనివారం సాయంత్రం ప్రదర్శించిన పలు నాట్యాంశాలు ఆకట్టుకున్నాయి. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్ సూత్రధారిగా కొనసాగిన 'భామాకలాపం' నృత్యరూపకం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సత్యభామగా అక్షర దేవెళ్ల ఆకట్టుకున్నారు.

సౌకర్యాలేవి సార్

జగనన్న లే అవుట్లలో సదుపాయాలు లేక ఇబ్బందులు

ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న వారి పరిస్థితి అగమ్యగోచరం

- అర్ధంతరంగా వదిలేసిన నాటి వైసీపీ ప్రభుత్వం
- నాడు బిల్లులు మంజూరు కాక కాంట్రాక్టర్ల కేసులు
- ఐదు నియోజకవర్గాల్లోని లే అవుట్లను పరిశీలించిన కలెక్టర్
- రోడ్లు, మంచినీరు, విద్యుత్ కల్పించాలని స్థానికుల వినతి
- దయనీయంగా జిల్లాలోని 665 లే అవుట్ల పరిస్థితి

వైసీపీ హయాంలో ఏర్పాటుచేసిన జగనన్న లే అవుట్లలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెరక పనులు కూడా జరగకపోవడంతో ఇళ్లు నిర్మించుకుని అక్కడ నివాసం ఉంటున్నవారు అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదనలు లేకపోవడంతో రోడ్లయినా నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలో 665 జగనన్న లే అవుట్లు ఉండగా, పట్టణ ప్రాంతాల్లో సెంటుభూమి, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర భూమి చొప్పున లబ్ధిదారులకు కేటాయించారు. వీటిలో అధిక శాతం మందికి నేటికీ తమకు కేటాయించిన స్థలం ఎక్కడుందో తెలియని పరిస్థితి. కొందరు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. కానీ, ఈ లే అవుట్లలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. గృహ నిర్మాణ పురోగతిపై నెలలో రెండు విడతలుగా కలెక్టర్ బాలాజీ అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇళ్ల నిర్మాణంలో పురోగతి మిగతా 8లో..



మచిలీపట్నం మండలం రుద్రవరంలోని లే అవుట్‌లో అంతర్గత రహదారుల పరిస్థితి

ప్రతిపాదనలు తయారుచేసేనా..?


జిల్లాలోని లే అవుట్లలో అంతర్గత రహదారులను అభివృద్ధి చేసేందుకు ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదనలు తయారు చేయలేదని పంచాయతీరాజ్ విభాగం అధికారులు చెబుతున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా అంతర్గత రహదారులను మెరక చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ గతంలో అధికారులకు సూచించారు. నవంబరు చివరి నాటికి వర్షాలు తగ్గుముఖం పడితే ఉపాధి హామీ పథకం, ఇతరత్రా నిధులతో కొంతమేర అయినా పనులు చేయాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

వివిధ దశల్లో ఉన్న 32,354 ఇళ్లు

665 లే అవుట్లలో 86,084 ఇళ్లు నిర్మించేందుకు స్థలాలు ఇచ్చారు. ఇందులో 62,187 ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వగా, 29,833 పూర్తి చేశారు. మరో 32,354 నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్నాయి. 5,033 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదు. నూతన కాలనీల్లో ఇళ్ల మధ్య రహదారులకు మెరక కూడా చేయలేదు. దీంతో నివాసం ఉంటున్నవారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొద్దిపాటి వర్షానికే ఇళ్ల మధ్య నీరు నిలిచిపోతోంది. దీంతో కొత్తగా ఇళ్లు కట్టుకునేవారు ఇటుకలు, ఇసుక, ఇనుము వంటి మెటీరియల్‌ను తెచ్చుకునేందుకు వీల్లేని పరిస్థితి ఏర్పడింది. ఈ కాలనీల్లోని అంతర్గత రహదారుల పనులు చేయించే బాధ్యతను గతంలో పంచాయతీరాజ్ విభాగానికి అప్పగించారు. గన్నవరం, తదితర మండలాల్లోని లే అవుట్లలో రహదారుల నిర్మాణ పనులు చేసినా బిల్లులు మంజూరు కాకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు మంజూరు కావడం లేదనే కారణంతో కాంట్రాక్టర్లు టెండర్లు కూడా వేయకపోవడంతో లే అవుట్లలో కనీస వసతులు ఏర్పాటు చేయలేదు.

నేడు బెజవాడలో దీపావళి సంబరాలు

హాజరుకానున్న సీఎం చంద్రబాబు



విజయవాడ సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : దీపావళి వేడుకలకు నగరం సిద్ధమవుతోంది. పున్నమి ఘాట్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించే వేడుకలకు సొసైటీ ఫర్ వైబ్రెంట్-విజయవాడ సన్నాహాలు చేస్తోంది. ఈ ఉత్సవాల్లో సీఎం చంద్రబాబు పాల్గొంటారని నిర్వాహకులు ప్రకటించారు. దసరా శరన్నవరాత్రుల్లో 11 రోజుల పాటు పున్నమి ఘాట్‌లో విజయవాడ ఉత్సవ్ జరిగిన విషయం తెలిసిందే. ఇదే ఉత్సాహంతో దీపావళి వేడుకలు నిర్వహించనున్నారు. సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ ఉత్సవాల్లో అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. బాణాసంచా పేలుళ్లతో ఒకరోజు ముందే దీపావళి సంబరాలు నిర్వహిస్తారు.



ఈ దీపావళికి మట్టి దీపాలు మార్కెట్‌లో ఆకట్టుకుంటున్నాయి. సరికొత్త ఆకృతుల్లో చూడముచ్చటగా ఉంటున్న వీటిని కొనేందుకు వినియోగదారులు ఆసక్తి చూపిస్తున్నారు. ఆధునిక విద్యుత్ దీపాలను వెనక్కి నెట్టి ముందు వరుసలో నిలిచిన వీటి తయారీ కొత్తూరు తాడేపల్లిలో జరుగుతోంది.

ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లో పోస్టింగ్‌లు చిత్రవిచిత్రంగా జరుగుతున్నాయి. ఉన్నతాధికారుల ఆలోచనలు ఒకలా ఉంటే.. వాటిని అమలు చేయాల్సిన కిందిస్థాయి అధికారులు మరోలా ఉంటున్నారు. ఆరోపణలు, అభియోగాలు లేని వారికి స్థానాలు కేటాయించాలని అధికారులు భావిస్తుంటే, మరకలు అంటించుకున్న సిబ్బంది మాత్రం కిందిస్థాయి అధికారులను ప్రసన్నం చేసుకుని స్థానాలు సర్దుబాటు చేసుకుంటున్నారు. దీనికి ప్రత్యక్ష నిదర్శనమే సీటీఎఫ్ (సిటీ టాస్క్‌ఫోర్స్) విభాగంలో తాజాగా జరిగిన పరిణామం.



టాస్క్ పూర్తిచేశాడు..!

బదిలీని వదిలించుకుని తిరిగి టాస్క్‌ఫోర్స్‌కు..

- కమిషనరేట్‌లో వివాదాస్పదంగా ముగ్గురు కానిస్టేబుళ్ల వ్యవహారం
- సిటీ టాస్క్‌ఫోర్స్ నుంచి బదిలీ చేసిన పోలీసు కమిషనర్
- జి.కొండూరు పేకాట కేసులో ఆరోపణలతో చర్యలు
- నాలుగు రోజుల క్రితం తిరిగి పోస్టింగ్ తెచ్చుకున్న ఓ కానిస్టేబుల్
- మరో ఇద్దరు కూడా వచ్చేందుకు తీవ్ర ప్రయత్నాలు
- ఈ ముగ్గురికి సహకరిస్తున్న అధికారులపై ఆరా

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పోలీసు కమిషనరేట్‌కు టాస్క్‌ఫోర్స్ విభాగం గుండెకాయ వంటిది. మొత్తం విభాగాలన్నింటిలో దీనికి అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. సర్వీసు ట్రాక్ రికార్డు బాగున్న వారికే ఇందులో స్థానం కల్పిస్తారు. ఈ విభాగం పర్యవేక్షణ విజయవాడతో పాటు ఎన్టీఆర్ జిల్లా మొత్తం ఉంటుంది. పోలీసు కమిషనర్ ఆధీనంలో మిగతా 8లో..

ఒకరి తర్వాత ఒకరు

టాస్క్‌ఫోర్స్ పేరును ఉపయోగించుకుంటే ఎలాంటి మేలు జరుగుతుందో తెలుసుకున్న ఈ త్రిమూర్తులుకు దానిపై ప్రేమను ఏమాత్రం తగ్గించుకోలేదు. ఇక్కడి నుంచి మహిళా పీఎస్‌కు బదిలీ అయిన కానిస్టేబుల్ తిరిగి సీటీఎఫ్‌లో పోస్టింగ్ దక్కించుకున్నాడు. నాలుగు రోజుల క్రితమే మహిళా పీఎస్ నుంచి ఇక్కడికి వచ్చి రిపోర్టు చేశారు. ఒక అధికారి సహకారంతో ఆయన టాస్క్‌ఫోర్స్‌లో అడుగుపెట్టినట్టు తెలుస్తోంది. త్రిమూర్తుల్లో ఒకరికి మార్గంసుగమం కావడంతో మిగిలిన ఇద్దరూ అదే బాటలో వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు ట్రాఫిక్‌లో ఉన్న కానిస్టేబుల్ సీటీఎఫ్‌కు రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని తనకు అనుకూలంగా ఉన్నవారితో మంతనాలు చేస్తున్నాడు. ఇతనికీ లైన్‌క్లియర్ అయిపోతే విజిలెన్స్‌లో ఉన్న కానిస్టేబుల్ కూడా ఇక్కడికి రావడానికి అడుగులు వేయాలని చూస్తున్నాడు. పోలీసు కమిషనర్‌కు కొంతమంది అధికారులు అసలు విషయం చెప్పకుండా ఆయన బిజీగా ఉన్న సమయాల్లో బదిలీ ఉత్తర్వులపై సంతకాలు చేయించుకుంటున్నారన్న ప్రచారం కమిషనరేట్‌లో జరుగుతోంది.

సీవీటీ.. చెకింగ్ వెహికల్ ట్యాక్స్. వాణిజ్య పన్నుల శాఖ విధినిర్వహణలో ఇదొక భాగం. వివిధ ప్రాంతాల నుంచి సరుకులతో వెళ్తున్న వాహనాలను తనిఖీ చేసి బిల్లులు ఉన్నాయా, ప్రభుత్వానికి పన్నులు చెల్లించారా లేదా అనే విషయాన్ని పరిశీలించేది సీవీటీ. అత్యంత గోప్యంగా ఉండాల్సిన ఈ సమాచారం కార్యాలయం గేట్లు దాటుతోంది. ఎక్కడ తనిఖీలు జరుగుతాయో ఆ ప్రదేశం వివరాలన్నీ ముందే డీలర్లు, ఆడిటర్లకు చేరుతున్నాయి. ఇది ఇప్పుడు వాణిజ్య పన్నుల శాఖలో హాట్ టాపిక్‌గా మారింది. అధికారుల వద్ద ఉండే కిందిస్థాయి సిబ్బంది నుంచి ఈ సమాచారం లీకవుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

ఇంటిదొంగలు

వాణిజ్య పన్నుల శాఖలో సబార్డినేట్ల చిత్రాలు

- సీవీటీ తనిఖీల సమాచారం ముందే లీక్
- కీలకంగా మారుతున్న కిందిస్థాయి సిబ్బంది
- డీలర్లు, ఆడిటర్లకు అప్పటికప్పుడు సమాచారం
- చేతికి చిక్కిన వాహనాలతో బేరాసారాలు
- వసూలు రాయుళ్లకు అధికారుల అండదండలు



విజయవాడలోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం మూడు డివిజన్లు ఉన్నాయి. విజయవాడ-1 డివిజన్ పరిధిలో నందిగామ, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, పార్కురోడ్డు, ఇంద్రకీలాద్రి, భవానీపురం సర్కిళ్లు ఉన్నాయి. విజయవాడ-2 డివిజన్‌లో సామారంగంచౌక్, కృష్ణలంక, బెంజిసర్కిల్, సూర్యారావుపేట, ఆటోనగర్, గాంధీనగర్ సర్కిళ్లు ఉన్నాయి. విజయవాడ-3 డివిజన్‌లో బందరు, గుడివాడ, రామవరప్పాడు, పెనమలూరు, పటమట సర్కిళ్లు ఉన్నాయి. మొత్తం ఉమ్మడి జిల్లాలో 17 సర్కిళ్లు ఉన్నాయి. ఇవికాకుండా ఒక్కో డివిజన్‌లో స్పెషల్ సర్కిల్ ఉంటుంది. వాటితో కలిపి మొత్తం 20 సర్కిళ్లు ఉన్నాయి. ఈ సర్కిళ్లలో పనిచేసే కిందిస్థాయి ఉద్యోగులు మొత్తం చక్రం తిప్పుతున్నారని తేలిపోయింది. ఇప్పటి వరకు సబార్డినేట్లపై వచ్చిన ఫిర్యాదులను కొట్టిపారేసిన అధికారులు ఇప్పుడు సమాధానం చెప్పుకోలేని స్థితిలో ఉన్నారు. వన్‌టౌన్‌లోని మిగతా 8లో..



సైకిల్ ర్యాలీ

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలు నుంచి కోనేరు సెంటర్, మూడు స్తంభాల సెంటర్ వరకు శనివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అధికారులు, నగర ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ ర్యాలీలో కలెక్టర్ బాలాజీ పాల్గొన్నారు.

నేడు దుర్గగుడిలో మహాలక్ష్మీ యాగం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ధనత్రయోదశిని పురస్కరించుకుని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలోని నూతన యాగశాలలో ఆదివారం ఉదయం 8 గంటలకు శ్రీమహాలక్ష్మీ యాగం నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటలకు ఈవో శీనానాయక్, ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సిబ్బంది అమ్మవారికి గాజులు సమర్పిస్తారు. సోమవారం దీపావళి సందర్భంగా దుర్గమ్మ ప్రధాన ఆలయంలో ధనలక్ష్మీ పూజ, దీపాలంకరణ, బాణాసంచా కాల్చడం వంటి కార్యక్రమాలు జరుగుతాయి. రాత్రి 7 గంటలకు కవాట బంధనం చేసి ఆలయాలను మూసేస్తారు. తిరిగి మంగళవారం వేకువజామున యథావిధిగా ఆలయాన్ని తెరుస్తారు.

బ్రాండ్ ఒకటి.. లేబుల్ మరొకటి

గన్నవరంలో బీరు కలకలం

విజయవాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నకిలీ మద్యం వ్యవహారం వెలుగులోకి వచ్చాక బీరు, మద్యానికి సంబంధించిన విషయాల్లో తేడాలు వివాదాస్పదమవుతున్నాయి. తాజాగా గన్నవరంలో ఓ వైన్ షాపు వద్ద బీరుసీసాపై ఒక బ్రాండ్, లేబుల్ మరో బ్రాండ్ ఉండటం చర్చకు దారితీసింది. గన్నవరంలోని ఓ వైన్ షాపులో శుక్రవారం రాత్రి కొంతమంది యువకులు కింగ్‌ఫిషర్ బీర్ కొన్నారు. వారు తీసుకున్న సీసాపై కింగ్‌ఫిషర్ అని ముద్రణ ఉన్నప్పటికీ లేబుల్ మాత్రం కల్యాణి అని ఉంది. దీంతో యువకులు గొడవ చేశారు. ఎక్సైజ్ పోలీసులు అక్కడికి చేరుకుని ఉన్నతాధికారులకు వివరాలు పంపించారు. పోలీసులు వివరాలు తెలుసుకుని నకిలీ కాదని తెలుసుకుని.. సర్దిచెప్పడంతో యువకులు శాంతించారు.

పేర్ని నానికి మతిచెడింది

కల్తీ మద్యంపై పారదర్శకంగానే విచారణ » మీడియా సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర




మచిలీపట్నం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కల్తీ మద్యం సూత్రదారులందరి అవినీతి అక్రమాలను వెలికితీసేందుకు సిట్ ఏర్పాటు చేశామని, పారదర్శకంగా విచారణ జరుపుతుంటే పేర్ని నాని మతిచెడి మాట్లాడుతున్నారని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. మచిలీపట్నంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇబ్రహీంపట్నంలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను గుంటూరు ల్యాబ్‌కు పంపించామన్నారు. నివేదికలు బయటకు రాకముందే వైసీపీ నాయకులు, బ్లూ మీడియా తప్పుడు ప్రచారం చేస్తోందన్నారు. వైసీపీ నాయకుల ప్రోత్సాహంతోనే కల్తీ మద్యం తయారు చేసినట్టు రుజువైందని, ఈ కేసులో ప్రధాన నిందితుడు జనార్దనరావు స్పష్టం చేశారన్నారు. జోగి రమేశ్ అండతోనే ఇబ్రహీంపట్నం, మొలకలచెరువులో మద్యం కల్తీ చేసినట్టు జనార్దనరావు చెప్పారన్నారు. అదే సమయంలో జనార్దనరావు తన ఇంటికి వచ్చినట్టు జోగి రమేశ్ కూడా అంగీకరించారన్నారు. కల్తీ మద్యం కేసులో మిగతా 8లో..

మచిలీపట్నం అభివృద్ధికి ముడా నిధులు

మచిలీపట్నం నగర అభివృద్ధికి ముడా నిధులు వెచ్చిస్తున్నామని, వివిధ పనులు చేపడుతున్నామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పలు అభివృద్ధి పనులపై శనివారం తన కార్యాలయంలో ఆయన ముడా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పోర్టు రోడ్డు నుంచి మెడికల్ కాలేజ్ వరకు రోడ్డు నిర్మాణంపై చర్చించారు.

మట్టి దివ్వెలు



ఆంధ్రజ్యోతి, విజయవాడ రూరల్: దీపావళి పండుగలో బాణా సంచాకు ఎంత ప్రాముఖ్యత ఉందో మట్టి దీపాలకు అంతే ప్రాధాన్యత ఉంది. పండుగ నాడు ఇల్లంతా దీపాలతో అలంకరిస్తే వచ్చే కళను లక్ష్మీకళగా భావిస్తుంటారు. ముఖ్యంగా మహిళలు ఇంటి గుమ్మాల ముందు, ఆరు బయట దీపాలు పెట్టి మురిసిపోతుంటారు. దీపాలతో ఇంటికి వచ్చే కళ కోసం మహిళలు పడే తాపత్రయం అంతా ఇంతా కాదు. గతంలో సాధారణ మట్టి ప్రమిదలలో నూనె వేసి, ఒత్తులు పెట్టి దీపాలను సిద్ధం చేసేవారు. కాలక్రమేణా ఆధునీకత పుణ్యమాని చాలా ఇళ్లలో విద్యుత్ దీపాలు రావడంతో మట్టి దీపాల వినియోగం దాదాపుగా తగ్గిపోయింది. ఈ పరిస్థితుల్లో ఆధునిక విద్యుత్ దీపాలను తల దన్నేలా నేడు మట్టి దీపాలు మళ్లీ జీవం పోసు కున్నాయి. ఆధునికతను సంతరించుకుని విద్యుత్ దీపాలను వెనక్కి నెట్టి వివిధ ఆకృతుల్లో మళ్లీ ముందు వరుసలోకి వచ్చేశాయి. విజయవాడ నగరానికి సమీపంలోని కొత్తూరు తాడేపల్లి గ్రామం మోడల్ మట్టి ప్రమిదలకు కేరాఫ్‌గా మారింది. నగరంలో నేడు అందుబాటులోకి వచ్చాయి.



- మళ్లీ జీవం పోసుకున్న మట్టి దీపాలు
- సరికొత్త ఆకృతుల్లో మార్కెట్‌లోకి..





డయాలసిస్ యూనిట్ ప్రారంభం



కూచిపూడిలోని సిలికానాంధ్ర ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న తహసీల్దార్ మస్తాన్, ప్రవాస భారతీయుడు సీతారామ్

కూచిపూడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలోని సిలికానాంధ్ర ఆస్పత్రిలో 7వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నూతనంగా డయాలసిస్ యూనిట్ ప్రారంభించారు. ప్రవాస భారతీ యురాలు జ్యోతి చింతలపూడి సహకారంతో రూ.7.50 లక్షలతో ఏర్పాటు చేసిన యూనిట్‌ను తహసీల్దార్ కె.మస్తాన్, ప్రవాసభారతీయులు పురాణం సీతారామ్ బటన్ నొక్కి ప్రారంభించారు. ఆస్పత్రి ఏవో జొన్నలగడ్డ హనుమకుమార్, సహాయ పరిపాలనాధికారి నిమ్మగడ్డ సత్య ప్రకాష్, వైద్యులు శివప్రసాద్, లిల్లీపాల్, శ్రావణి, పసుమర్తి శ్వేత, గ్రామ ప్రముఖులు బెల్లంకొండ వెంకటేశ్వరరావు, యార్లగడ్డ సుభాష్ చంద్ర బోస్, పిన్నమనేని గోపాలకృష్ణ, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థి మృతిపై విచారణ



విద్యార్థి ఆరోగ్యరక్ష రికార్డులు పరిశీలిస్తున్న మహాత్మా జ్యోతిబా గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి మాధవీలత

మోపిదేవి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి బీసీ బాలుర గురుకుల పాఠశాలలో ఆరవ తర గతి విద్యార్థి ఆరేవరపు భార్గవ్ అనారోగ్యంతో విజయవాడ వైద్యశాలలో మృతి చెందటం బాధకరమని మహాత్మాజ్యోతిబా గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి పి.మాధవిలత అన్నారు. శనివారం ఆమె గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన సంవత్సర కాలంగా విద్యార్థికి సంబంధించిన ఆరోగ్య రక్ష వైద్య పరీక్షల రికార్డులను పరిశీలించారు. ఏ విధమైన అనారోగ్య సమస్యలు లేకపోవటంతో మృతికి గల కారణాలపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి యుగంధర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వేల మందిలో ఒక్కొక్కరికి ఈ విధమైన సమస్య వస్తుందని, కార్డియాక్ అరెస్టు కారణంగానే విద్యార్థి మృతి చెందినట్లు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తెలిపారని ఆమె వివరించారు. విద్యార్థి కుటుంబసభ్యులకు సానుభూతిని తెలియజేశారు. ప్రిన్సిపాల్ కె.వీరరవి పాల్గొన్నారు.

అన్నప్రసాదంలో నాణ్యత తప్పనిసరి

- దుర్గగుడి ఈవో శీనానాయక్



అన్న ప్రసాదం నాణ్యత అడిగి తెలుసుకుంటున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో భక్తులకు వడ్డించే అన్నప్రసాదంలో నాణ్యత తప్పనిసరిగా ఉండాలని ఈవో వి.కె.శీనానాయక్ అన్నారు. ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల సన్నిధిలో భక్తులకు ఏర్పాటు చేసిన సదుపాయాల గురించి ఆయన శనివారం భక్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం భక్తులతో కలసి అన్నప్రసాదం స్వీకరించారు. ప్రతి రోజు అన్నప్రసాదం విభాగం ఏఈవో, సూపరింటెంట్‌లు భక్తులతో కలసి భోజనం చేసి నాణ్యతపై నివేదిక ఇవ్వాలన్నారు.

బంగారు లక్ష్మీకాసుల హారం సమర్పణ



ఇంద్రకీలాద్రి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం వరంగల్‌కు చెందిన జి.రామకృష్ణ దంపతులు సుమారు రూ.4లక్షల విలువ చేసే 34 గ్రాముల బంగారు లక్ష్మీకాసుల హారం కనకదుర్గమ్మకు సమర్పించారు. ఆలయ అధికారులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈఓ బి.వెంకటరెడ్డి, అధికారులు రామకృష్ణ కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి, అమ్మవారి చిత్రపటం, కానుక రశీదును అందచేశారు.

పేర్ని నానీకి మతిచెడింది

(7వ పేజీ తరువాయి)

వైసీపీ నాయకుల పాత్ర, ప్రభుత్వంపై చేసిన కుట్ర బయటపడుతుంటే పేర్ని నాని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. హోలోగ్రామ్, ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టమ్ రాష్ట్రంలో అమలు జరుగుతున్నప్పటికీ పేర్ని నాని అమలు జరగడం లేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2014-19లోనే హోలోగ్రామ్, ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టమ్‌ను తీసుకొచ్చామని మంత్రి చెప్పారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థను మొత్తం నాశనం చేశారన్నారు. ఐదేళ్లుగా కల్తీ మద్యాన్ని ప్రజల నెత్తిన రుద్దారన్నారు. కల్తీ మద్యం అమ్మకాల కోసం ఏకంగా టార్గెట్లు పెట్టి మరీ తరలించారన్నారు. రాష్ట్రంలో రూ.99 మద్యం బ్రాండ్లు కూటమి ప్రభుత్వం ఆపేసిందని పేర్ని నాని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మద్యం షాపు నిర్వాహకులు పెట్టిన ఇండెంట్ ప్రకారమే మద్యం సరఫరా జరుగుతుందన్నారు. వైసీపీ హయాంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యాన్ని తాగారని, ఇప్పుడా అవకాశం లేకుండా పోయిందన్నారు. ఏపీ సురక్ష యాప్ ద్వారా ప్రతి బాటిల్ స్కాన్ చేసుకుని చూడవచ్చన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని వివరించారు.

వాయు, శబ్ద కాలుష్య రహిత సమాజం నిర్మిద్దాం

- స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ



మచిలీపట్నంలోని అన్నా క్యాంటీన్‌లో అల్పాహారం స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి): వాయు, శబ్ద కాలుష్య రహిత సమాజం నిర్మాణంలో భాగస్వాములవుదామని కలెక్టర్ బాలాజీ పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలు నుంచి కోనేరుసెంటర్, మూడు స్తంభాల సెంటర్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అధికారులు, నగర ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి నెలా 3వ శనివారం ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రం చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం పరిధిలో చెత్తను తొలగించి చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో శిథిలమైన భవనాన్ని పరిశీలించారు. పశువులతో పాటు పెంపుడు కుక్కలకు అందిస్తున్న సేవలను పశుసంవర్థక శాఖాధికారి చిన నరసింహులును అడిగి తెలుసుకున్నారు. థర్మల్ పవర్ విద్యుత్‌కు బదులు సౌరశక్తిని వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ పోతురాజు, డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్.వెంకట్రావు, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మాజీ జెడ్పీటీసీ లంకే నారాయణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● సౌరశక్తిని వినియోగించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రధాన ద్వారం నుంచి సాయిబాబా గుడి వరకు ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యానందం, డీఈ గోవర్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

● మచిలీపట్నంలో శనివారం ఉదయం పర్యటిస్తూ మూడు స్తంభాల సెంటర్‌లో అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ బాలాజీ సందర్శించారు. అన్న క్యాంటీన్‌లో టిఫిన్ చేశారు. తన కార్యాలయానికి సైకిల్‌పై వెళ్లారు.



- కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సైకిల్ ర్యాలీ

పీఎంసీ ఎదురుగా పరిసరాలను శుభ్రం చేస్తున్న చలసాని ఆంజనేయులు, పాలక వర్గ సభ్యులు, అధికారులు

భావి తరాలకు పరిశుభ్రమైన వాయువునిద్దాం

చిట్టినగర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు తరాలకు పరిశుభ్రమైన వాయువును ఇచ్చేందుకు కృషి చేద్దామని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో శనివారం చిట్టినగర్ కృష్ణా మిల్క్ యూనియన్‌లో నిర్వహించారు. స్వచ్ఛ వాయు ప్రతిజ్ఞను ఆంజనేయులు, మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర బాబు, పాలకవర్గ సభ్యులు, సమితి అధికారులు, సిబ్బందితో కలిసి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చలసాని మాట్లాడుతూ శుభ్రమైన వాయువు మన ఆరోగ్యానికి, పర్యావరణానికి, భవిష్యత్తు తరాలకు అత్యంత అవసరమన్నారు. సీఎం చంద్రబాబు విజన్‌కి అనుగుణంగా ముందుకు సాగుదామన్నారు. కృష్ణా మిల్క్ యూనియన్ పరిధిలో అన్నీ పాల సేకరణ కేంద్రాలు, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్లు, పార్లర్‌లలో కూడా ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన వివరించారు. అనంతరం ఫ్యాక్టరీ ఆవరణ నుంచి సీతమ్మ వారి పాదాల వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సీతమ్మ వారి పాదాల పరిసర ప్రాంతాలలో చెత్త, వ్యర్థాల తొలగింపు, పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, విజయవాడ పశ్చిమ శాసన సభ్యుల కార్యాలయ ప్రధాన కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్, కృష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ సభ్యులు బొట్టు రామచంద్ర రావు, నెక్కళపు వాణి శ్రీ, నెలకుదిటి నాగేశ్వరరావు, ఇంజం రామారావు, సమితి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి దొంగలు

(7వ పేజీ తరువాయి)

పంజా సెంటర్‌లో ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం నుంచి లంచం తీసుకుంటూ గవర్నరుపేట సర్కిల్ అటెండర్ కొండపల్లి శ్రీనివాసరావు ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత వాణిజ్య పన్నుల శాఖలోని అధికారులు, వారి కింద పనిచేసే సిబ్బంది సిత్రాలు బయటకు వస్తున్నాయి.

వసూళ్లు ఇలా..

సర్కిళ్లలో అధికారులు నిత్యం సీవీటీ తనిఖీలు చేస్తుంటారు. ఈ తనిఖీల్లో డీసీటీవో, ఏసీటీవో, ఇన్‌స్పెక్టర్ ఉంటారు. వారితో పాటు వాహనాలను ఆపడానికి అటెండర్లు, వాచ్‌మెన్లను కొంతమంది ఉపయోగించుకుంటున్నారు. కొంతమంది అధికారులు వారి వాహనాలను నడిపే డ్రైవర్లను తనిఖీలకు నియమించుకుంటున్నారు. ఒకప్పుడు డివిజన్లలో సర్కిల్ అధికారులు తోచినప్పుడల్లా తనిఖీలకు వెళ్లేవారు. వైసీపీ హయాంలో ఈ విధానం మొత్తం మారిపోయింది. కమిషనర్ కార్యాలయం నుంచి తనిఖీలకు వెళ్లమని ఆదేశాలు వస్తేనే సర్కిళ్ల నుంచి అధికారులు రహదారులపైకి రావాలి. కమిషనర్ కార్యాలయం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండా తనిఖీలకు వెళ్లినట్టు తెలిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. సీవీటీ తనిఖీలకు సంబంధించి కమిషనర్ కార్యాలయం నుంచి డివిజన్ల పరిధిలో సర్కిళ్లకు ఆదేశాలు వస్తున్నాయి. ఒక సర్కిల్ పరిధిలో జరిగే తనిఖీలకు మరో సర్కిల్ అధికారులను రంగంలోకి దింపుతున్నారు. ఈ సీవీటీ తనిఖీల సమాచారం వాహనాల్లో సరుకులను పంపే సంస్థల అధినేతలకు చేరుతోంది. కొన్నిచోట్ల మాత్రం తనిఖీల సమయంలో లోపాలను గుర్తించిన అధికారులు వెంటనే బేరాలు మొదలుపెడుతున్నారు. ఈ లావాదేవీల్లో గుమస్తాలు, అటెండర్లు, వాచమెన్లు, డ్రైవర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీవీటీల్లో జరుగుతున్న వ్యవహారాలు ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో జిల్లాలోని అధికారులకు క్లాస్ తీసుకున్నారు.

అధికారులు, సిబ్బంది సత్సంబంధాలు

బిల్లులో లోపాలను గుర్తించి డబ్బు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు సీన్‌లో కనిపించకుండా కిందిస్థాయి సిబ్బందితో వ్యవహారాలు చక్కబెట్టిస్తున్నారు. సిబ్బంది వసూళ్లు చేసి అధికారులకు వాటాలు ఇవ్వడంతో వారిపై ఈగ వాలకుండా కాపాడుకుంటున్నారు. అధికారులకు కిందిస్థాయి సిబ్బందికి సంబంధాలు బలంగా ఉండటానికి కారణం ఇదేనని తెలుస్తోంది. తాజా ఘటనతో అయినా వాణిజ్య పన్నుల శాఖలో మార్పు వస్తుందా అని వ్యాపార వర్గాల్లో చర్చ నడుస్తోంది.

కులగణన చేయకుంటే ఉద్యమమే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

మచిలీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనగణనతో పాటు, కులగణన జరపకపోతే రానున్న రోజులలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మచిలీపట్నంలోని వేమూరి కల్యాణ మండపంలో శనివారం సీపీఐ నేతృత్వంలో జనగణనతోపాటు కులగణన చేయాలని, జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలనే డిమాండ్‌తో బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనతోపాటు ఆయా బీసీ కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంచనా వేయాలన్నారు. ఎన్టీఆర్ రాజకీయ రంగప్రవేశంతో బీసీలు కొంతమేర రాజకీయంగా ఎదిగారని, అది కూడా రాయలసీమ ప్రాంతంలోనన్నారు. బీసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు వెంగళరావు, సమావేశానికి అధ్యక్షత వహించిన నార్ల వెంకటేశ్వరరావు, బీసీసంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ప్రసంగించారు. ఈ సమావేశంలో సీపీఐ ఎన్టీఆర్‌జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, బీసీ నాయకులు బండారు ఆనందప్రసాద్, శొంఠినాగరాజు, అందే జగదీష్ పాల్గొన్నారు.

మంత్రి అపార్ట్‌మెంట్ కోసం రోడ్లు విస్తరిస్తారా?

- మాజీ మంత్రి పేర్ని నాని

మచిలీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం చేపల మార్కెట్ సమీపంలో మంత్రి కొల్లు రవీంద్ర నిర్మాణం చేసే అపార్ట్‌మెంట్ కోసం పక్కనే రహదారులను విస్తరిస్తారా అని మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. మచిలీపట్నం వైసీపీ కార్యాలయం వద్ద శనివారం మీడియాతో మాట్లాడారు. మంత్రి నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌కు ఇంత వరకు అనుమతులు లేవన్నారు. అయినా పోర్టు నిర్మాణం చేసే సంస్థ నుంచి సిమెంట్, కాంక్రీట్ తెచ్చి పనులు శరవేగంగా చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ భవనం అనుమతుల కోసం బెల్లంకొట్ల రోడ్డు నుంచి రహదారిని అభివృద్ధి చేసేందుకు. తన అపార్ట్‌మెంట్ వద్ద తక్కువగా, మిగిలిన ప్రాంతంలో అధికంగా స్థలం సేకరించేందుకు కుట్ర చేశారన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లను, షాపులను ఖాళీ చేయిస్తున్నారని ఆరోపించారు. స్థలం కోల్పోయే బాధితులు తమకు అన్యాయం జరుగుతోందని, అండగా ఉండమని తన వద్దకు వచ్చారని, వారి తరఫున న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. కొల్లు రవీంద్ర అక్రమాలపై ముఖ్యమంత్రికి సైతం ఫిర్యాదు చేస్తామన్నారు. కృత్తివెన్ను మండలంలో వైశ్యులకు చెందిన 36 ఎకరాల భూమిని కాజేయడానికి, సరుగుడు చెట్లను నరికి విక్రయించేందుకు మంత్రి తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నారని, ఈ అంశంపైనా న్యాయ పోరాటం చేస్తామన్నారు.

ముందే కోతకొచ్చింది..

- గుడ్లవల్లేరులో కర్ణాటకకు చెందిన కోనారం సన్నాలు రకం వరి సాగు
- యంత్రాలతో నూర్పిడి చేయించిన ఇద్దరు యువ రైతులు







అంగలూరులో యంత్రం ద్వారా నూర్పిడి చేసి ట్రాక్టర్‌లో పోస్తున్న ధాన్యం, రైతులు బాబి, తేజ

ఆంధ్రజ్యోతి-గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో ఇద్దరు యువ రైతులు సాగు చేసిన కొత్తరకం వరి పైరు ముందే కోతకొచ్చింది. యంత్రాలతో నూర్పిడి చేయించి ధాన్యం రాసులగా పోశారు. వివరాల్లోకి వెళితే... గుడ్లవల్లేరుకు చెందిన వేములపల్లి రవికాంత్ (బాబి) గుడ్లవల్లేరులో మూడు ఎకరాల్లో, వేములపల్లి తేజ అంగలూరు కవిరాజునగర్‌లో ఏడు ఎకరాల్లో కర్ణాటకకు చెందిన కోనారం సన్నాలు(కె.ఎన్.వి1638) రకం వరి విత్తనాన్ని ఈ ఏడాది ప్రయోగాత్మకంగా సాగుచేశారు. ఈ రకం ఈ ప్రాంతంలోనే తొలిగా సాగైంది. 120 రోజుల పంట, సన్న రకం విత్తనం, మొక్క మూడు అడుగులకు మించని ఎత్తు ఉంది. తెగుళ్లు కానీ, దోమకాని ఈ రకానికి రాలేదని రైతులు చెప్పారు. పోట తెలుపు గానీ, నూకగాని అవ్వడంలేదు. దిగుబడి కూడా 38 బస్తాలు అయ్యే అవకాశం ఉందని కోసిన పంట రాసిని బట్టి అంచనా వేస్తున్నారు. వర్షాలకు, గాలికి తట్టుకొని నిలబడిందని ఈ రైతులు చెబుతున్నారు. 2025 జూన్ 17 నారుమడి పోయగా, అక్టోబరు 16, 2025 గత గురువారం కోత కోశారు. 120 రోజుల పంట కావడంతో మిగిలిన రకాల కంటే ఖర్చు కూడా తగ్గుతుందని వారంటున్నారు. పచ్చి ధాన్యం బస్తా రూ.1500కు కొంటామని బయటి వ్యక్తులు అడుగుతున్నారని బాబి చెప్పారు.

మండలంలో ఇదే తొలిసారి : ఏవో సునీల్

గుడ్లవల్లేరు మండలంలో కోనారం సన్నాలు (కె.ఎన్.వి1638) రకం వరి సాగు చేయడం ఇదే ప్రథమం అని మండల వ్యవసాయాధికారి సునీల్ చెప్పారు. ఈ-క్రాప్‌లో నమోదు చేశారు కాబట్టి రైతు సేవా కేంద్రం ద్వారా ప్రభుత్వమే ఈ రకం ధాన్యాన్ని కొంటుందని తెలిపారు. మండలంలో తొలిగా కోసిన చేలు కూడా ఇవేనన్నారు. ఈ రకం రైతుల సాగుకు ఉపయోగమేనా అని ప్రశ్నించగా, అప్పుడే చెప్పలేమని సునీల్ అన్నారు.

సౌకర్యాలేవి సార్

(7వ పేజీ తరువాయి)

కనిపించకపోవడానికి లే అవుట్లలో కనీస వసతులు లేకపోవడమే కారణమని గృహనిర్మాణ సంస్థ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇటీవల కలెక్టర్ జిల్లాలోని పెనమలూరు, పామర్రు, అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లోని లే అవుట్లను పరిశీలించారు. ఈ సమయంలో లే అవుట్లలో ఇళ్లు నిర్మించుకుని అక్కడే నివాసం ఉంటున్నవారు తాము పడుతున్న ఇబ్బందులకు కలెక్టర్ ఎదుట ఏకరువు పెట్టారు. నూతనంగా నిర్మించిన కాలనీల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి వసతులు కల్పించాలని కోరారు.

జిల్లాలోని లే అవుట్లలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన లే అవుట్లలో అంతర్గత రహదారులు నిర్మించకపోవడంతో అక్కడ నివాసం ఉండేవారు ఇబ్బందులు పడుతున్నారు.

● మచిలీపట్నం మండలం రుద్రవరంలో ఏర్పాటుచేసిన రెండు లే అవుట్లలో సగానికి పైగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఈ లే అవుట్లలో రూ.1.50 కోట్లతో మెరక పనులు చేసినట్లుగా చూపి గతంలో బిల్లులు చేసుకున్నారు. కానీ, పనులు సక్రమంగా చేయలేదు. ఇళ్ల మధ్య అంతర్గత రహదారులకు సంబంధించి పనులు చేయకపోవడంతో వర్షాకాలంలో ద్విచక్రవాహనం ఇంటి వరకు వెళ్లే అవకాశం కూడా లేకుండాపోయింది. ఇటీవల కలెక్టర్ ఈ కాలనీని పరిశీలించిన సమయంలో స్థానికులు తమ సమస్యలు చెప్పుకొన్నారు.

● గుండుపాలెం పంచాయతీ శివారు పల్లెపాలెంలో స్థలాలుగా ఇచ్చిన భూమి పల్లపు ప్రాంతంలో ఉంది. ఈ లే అవుట్‌లో మెరక పనులు సక్రమంగా చేయకుండానే వైసీపీ నాయకులు బిల్లులు చేసుకున్నారు.

● కరగ్రహారంలోని లే అవుట్‌లో 16 వేల మందికి సెంటు భూమి చొప్పున స్థలాలు ఇచ్చారు. ఇక్కడ కూడా అంతర్గత రహదారులకు సంబంధించిన పని ఒక్కటీ జరగలేదు.

● గన్నవరం మండలం కేసరపల్లి లే అవుట్‌కు వెళ్లేందుకు రూ.3 కోట్ల అంచనాతో వంతెన నిర్మిస్తామని రెండేళ్ల కిందట అధికారులు ప్రకటించారు. కానీ, ఇంతవరకు ఈ వంతెన పనులు ప్రారంభమే కాలేదు. ఇక్కడ ఎకరానికి రూ.70 లక్షలు చెల్లించి 60 ఎకరాలను కొని లే అవుట్ వేశారు. 3,400 మందికి స్థలాలు ఇచ్చారు. ఈ లే అవుట్‌కు వెళ్లేందుకు వంతెన నిర్మాణాన్ని మాత్రం పక్కన పెట్టేశారు. దీంతో ఇక్కడ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు సరైన దారిలేక ఇబ్బందులు పడుతున్నారు.

టాస్క్ పూర్తిచేశాడు..!

(7వ పేజీ తరువాయి)

ఉంటుంది. నగరంలో కీలకమైన కేసుల దర్యాప్తు బాధ్యతలను ఈ విభాగానికే అధికారులు అప్పగిస్తారు.

ఆ ముగ్గురు బదిలీ

కొద్దినెలల క్రితం జి.కొండూరులో జరిగిన పేకాట శిబిరంపై దాడిచేసి పట్టుకోవడానికి ఒక బృందం అక్కడికి వెళ్లింది. ఆ సమయంలో ఈ బృందం వ్యవహరించిన తీరుపై భారీగా ఆరోపణలు వచ్చాయి. పేకాట శిబిరం నిర్వహణకు సంబంధించి అసలు సూత్రధారిని తప్పించారన్నది ప్రధాన ఆరోపణ. పేకాటరాయుళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న మొత్తానికి, జి.కొండూరు పోలీసులకు అప్పగించిన మొత్తానికి మధ్య వ్యత్యాసం కూడా కనిపించింది. ఈ వ్యవహారాన్ని మొత్తం ముగ్గురు కానిస్టేబుళ్లు చక్కబెట్టారు. పేకాట విషయం, అక్కడ జరిగిన తతంగం మొత్తం బయటకు రావడంతో ఈ ముగ్గురు గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకున్నారు. నాడు టాస్క్‌ఫోర్స్‌కు ఏడీసీపీగా పనిచేసిన అరిటాకుల శ్రీనివాసరావును వెంటబెట్టుకుని పోలీసు కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. తాము ఏ తప్పూ చేయకుండా బురద జల్లుతున్నారని అతి వినయాన్ని ప్రదర్శించారు. అప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోని పోలీసు కమిషనర్ తర్వాత విచారణ చేయించారు. ఈ ముగ్గురూ పేకాట శిబిరం వద్ద ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించారన్న వాస్తవాలు తెలిశాయి. దీంతో ఉన్నట్టుండి టాస్క్‌ఫోర్స్ నుంచి ఈ ముగ్గురిని తలో విభాగానికి బదిలీ చేశారు. ఒక కానిస్టేబుల్‌ను మహిళా పోలీస్‌స్టేషన్‌కు, మరో కానిస్టేబుల్‌ను ట్రాఫిక్‌కు, ఇంకో కానిస్టేబుల్‌ను సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ బదిలీని నిలుపుదల చేసుకోవడానికి త్రిమూర్తులు అనేక ప్రయత్నాలు చేశారు. అయినా చివరికి బదిలీ వేటు తప్పలేదు.

పొగాకు వాడకంతో ఆరోగ్యానికి ముప్పు



గన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పొగాకు వాడకంతో ఆరోగ్య సమస్యలు పెరుగుతాయని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హిమబిందు అన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం ఆధ్వర్యంలో పొగాకు రహిత యువత కార్యక్రమం 3.0 శనివారం నిర్వహించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి పొగాకు వాడకాన్ని నిర్మూలించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. ప్రమాదకరమైన రోగాలు వస్తున్నా యని భవిష్యత్‌ను కాపాడుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హ్యాకథాన్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

ముగిసిన జాతీయ హ్యాకథాన్

కానూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో 24 గంటల పాటు సృజనాత్మకత, సహకారం, ఆవిష్కరణల దిశగా సాగిన జాతీయ హ్యాకథాన్ శనివారంతో ముగిసింది. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన గ్లూమ్‌దేవ్ సంస్థ సీఈవో తిరుమలరాజు మాట్లాడుతూ, పరిశ్రమ సంసిద్ధత, నిరంతర నైపుణ్యం పెంపునకు హ్యాకథాన్ దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎం. సునీతతోపాటు పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల స్వచ్ఛత అందరి బాధ్యత

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగానూ.. స్వచ్ఛం గానూ ఉంచాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని యార్డును శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్వచ్ఛతపై దృష్టి పెట్టారన్నారు. దేశాన్ని ప్లాస్టిక్ రహిత దేశంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పని చేస్తున్నామన్నారు. పెనమలూరు నియోజకవర్గంలోని తాడిగడప మున్సిపాలిటీ నుంచి ప్రతి రోజు సుమారు 150 టన్నుల వ్యర్థాలు, కంకిపాడు పంచాయతీ నుంచి సుమారు 10 టన్నుల వ్యర్థాలను పంచాయతీ సిబ్బంది సేకరించి ఎక్కడ వేయాల్లో అర్థం కాక నానా తంటాలు పడుతున్నా రన్నారు. చెత్తను రీ సైకిల్ చేసే విధంగా వేస్ట్ ఎనర్జీ ప్లాంటులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కంకిపాడు మార్కెట్ యార్డులో రోడ్లు శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్.. హనుమాన్‌జంక్షన్‌లో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



కానుమోలు హైస్కూల్ ఆవరణలో రాణా వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

ఉయ్యూరు : స్వర్ణాంధ్ర- స్వచ్ఛఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించి వాయు కాలుష్యం, వాతావరణ మార్పులవల్ల కలిగే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఉయ్యూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో చైర్మన్ వి.సత్యనారాయణ, కమిషనర్ జె.రామారావు, ఉద్యోగులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి బస్‌స్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్: స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం బాపులపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కె.జోగేశ్వరరావు ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పచ్చదనం- పరిశుభ్రత మీద వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బీఎస్. పూర్ణేశ్వరి, పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీవో కార్యాలయం ఏవో త్రినాధరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: మొక్కలు నాటడంతో పాటు పరిరక్షణ కూడా విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలని సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ అన్నారు. కానుమోలు హైస్కూల్, ఎంపీపీ స్కూల్ ఆవరణలో రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ధనలక్ష్మి, రామలక్ష్మి ఉపాధ్యాయులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాజ్‌మూన్ పాల్గొన్నారు.

పవిత్రమైనది అన్నదానం: పుట్టగుంట



హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పరమ పుణ్య కార్యంగా భావించే అన్నదానం అన్ని దానాల్లో కంటే పవిత్రమైనదని విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ అన్నారు. దేవస్థానం పాలక మండలి చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక ఏలూరు రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద అయ్యప్ప, శివమాల భక్తులకు నిర్వహిస్తున్న అన్న దానం శిబిరాన్ని పుట్టగుంట సతీష్‌కుమార్ శనివారం సందర్శించారు. అయ్యప్ప లకు ఫలహారాలు వడ్డించారు. టీడీపీ ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి వడ్డి వాసవి పాల్గొన్నారు.

24 బాణసంచా దుకాణాలకు అనుమతి

హనుమాన్‌జంక్షన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి బాణసంచా విక్రయాలకు సంబంధించి మండలంలో 24 దుకాణాలకు బాపులపాడు తహసీల్దార్ బి.మురళీకృష్ణ శనివారం అనుమతి ఇచ్చారు. జంక్షన్‌లో 17 దుకాణాలు, వేలేరు, వీరవల్లి, ఏ.సీతారాంపురం, మల్లవల్లి ,బండారుగూడెం గ్రామాల్లో మరో ఏడు దుకాణాలకు అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం నాణ్యత పెంచాలి

ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

ప్రసాదంపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత పెంచాలని ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. శనివారం రామవరప్పాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న యార్లగడ్డ పాఠశాలను పరిశీలించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులు యార్లగడ్డకు ఫిర్యాదు చేశారు. భోజనం రుచి చూసిన ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే వంట ఏజెన్సీ మార్చి భోజనం నాణ్యత పెంచాలని ఎంఈవోను ఆదేశించారు.



అన్నం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

కానూరులో ప్రబలుతున్న వ్యాధులు

కానూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కానూరులో వ్యాదులు ప్రబలుతున్నాయి. పలువురు వాంతులు, విరోచనాలతో బాధపడుతూ పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో శనివారం చికిత్స పొందుతున్నారు. కామయ్యతోపు, పటమటలోని రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో వాంతులు, విరోచనాలు, జ్వరంతో ముగ్గురు చికిత్స పొందారని స్థానికులు చెబుతున్నారు. కానూరు వినాయకనగర్‌లో ఒక మహిళకు ఆశావర్కర్ చికిత్స అందించారు. సనత్‌నగర్ జమదగ్ని వీధిలో మున్సిపల్ కుళాయి నుంచి పట్టుకొని నిల్వ ఉంచిన నీరు మరుసటి రోజుకి రంగు మారుతుందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై తాడిగడప మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్‌ను శనివారం ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ముగ్గురు జ్వరంతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారని చెప్పారు.




సూపర్ జీఎస్టీపై అవగాహన ర్యాలీ

ఉయ్యూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జీఎస్టీ తగ్గించి పేద, మధ్యతరగతి వర్గాలకు ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని ఉయ్యూరు రవాణా శాఖ అధికారి టీవీఎస్ సుబ్బారావు అన్నారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై శనివారం రవాణా శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వీరమ్మ ఆలయం వద్ద నుంచి బస్టాండ్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంవీఐ షేక్ ఆయేషా ఉస్మాని, జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

గన్నవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో ఉన్న అన్ని న్యాయ సేవాధికార సంస్థ కమిటీలు వేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీనియర్ న్యాయవాదులు, సోషల్ వర్కర్‌లు, న్యాయ విషయ నిపుణులు ఈ నెల 28వ తేదీ లోపు పూర్తి చేసిన దరఖాస్తు ఫారంను సంబంధిత న్యాయ సేవాధికార సంస్థ, కమిటీ కార్యాలయం నందు అందజేయాలని సూచించారు.



ఎన్‌సీసీకి 50 మంది విద్యార్థుల ఎంపిక

ఉయ్యూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఎన్‌సీసీ సెలక్షన్‌లో 50 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. శారీక దృఢత్వం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలతో పాటు ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేసినట్టు సుబేదార్ ఎస్. కృష్ణమూర్తి తెలిపారు. ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ పి.శ్రీరామ్ తేజ విద్యార్థులను అభినందించారు.

టీడీపీ పాలనలోనే డ్వాక్రా సంఘాల ఏర్పాటు

పెనమలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాలను చంద్రబాబు ఆధ్వర్యంలోని టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. డ్వాక్రా సంఘాల బుక్ కీపర్లకు గత ప్రభుత్వం విధించిన కాలపరిమితిని టీడీపీ కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలకు చెందినబుక్ కీపర్లు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా మహిళలు, బుక్‌కీపర్లు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను సన్మానించారు. టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిదొంగలు

(7వ పేజీ తరువాయి)

పంజా సెంటర్‌లో ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం నుంచి లంచం తీసుకుంటూ గవర్నరుపేట సర్కిల్ అటెండర్ కొండపల్లి శ్రీనివాసరావు ఏసీబీకి చిక్కిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత వాణిజ్య పన్నుల శాఖలోని అధికారులు, వారి కింద పనిచేసే సిబ్బంది సిత్రాలు బయటకు వస్తున్నాయి.

వసూళ్లు ఇలా..

సర్కిళ్లలో అధికారులు నిత్యం సీవీటీ తనిఖీలు చేస్తుంటారు. ఈ తనిఖీల్లో డీసీటీవో, ఏసీటీవో, ఇన్‌స్పెక్టర్ ఉంటారు. వారితో పాటు వాహనాలను ఆపడానికి అటెండర్లు, వాచ్‌మెన్లను కొంతమంది ఉపయోగించుకుంటున్నారు. కొంతమంది అధికారులు వారి వాహనాలను నడిపే డ్రైవర్లను తనిఖీలకు నియమించుకుంటున్నారు. ఒకప్పుడు డివిజన్లలో సర్కిల్ అధికారులు తోచినప్పుడల్లా తనిఖీలకు వెళ్లేవారు. వైసీపీ హయాంలో ఈ విధానం మొత్తం మారిపోయింది. కమిషనర్ కార్యాలయం నుంచి తనిఖీలకు వెళ్లమని ఆదేశాలు వస్తేనే సర్కిళ్ల నుంచి అధికారులు రహదారులపైకి రావాలి. కమిషనర్ కార్యాలయం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకుండా తనిఖీలకు వెళ్లినట్టు తెలిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. సీవీటీ తనిఖీలకు సంబంధించి కమిషనర్ కార్యాలయం నుంచి డివిజన్ల పరిధిలో సర్కిళ్లకు ఆదేశాలు వస్తున్నాయి. ఒక సర్కిల్ పరిధిలో జరిగే తనిఖీలకు మరో సర్కిల్ అధికారులను రంగంలోకి దింపుతున్నారు. ఈ సీవీటీ తనిఖీల సమాచారం వాహనాల్లో సరుకులను పంపే సంస్థల అధినేతలకు చేరుతోంది. కొన్నిచోట్ల మాత్రం తనిఖీల సమయంలో లోపాలను గుర్తించిన అధికారులు వెంటనే బేరాలు మొదలుపెడుతున్నారు. ఈ లావాదేవీల్లో గుమస్తాలు, అటెండర్లు, వాచమెన్లు, డ్రైవర్లు కీలకంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సీవీటీల్లో జరుగుతున్న వ్యవహారాలు ఉన్నతాధికారుల దృష్టికి చేరడంతో జిల్లాలోని అధికారులకు క్లాస్ తీసుకున్నారు.

అధికారులు, సిబ్బంది సత్సంబంధాలు

బిల్లుల్లో లోపాలను గుర్తించి డబ్బు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు సీన్‌లో కనిపించకుండా కిందిస్థాయి సిబ్బందితో వ్యవహారాలు చక్కబెట్టిస్తున్నారు. సిబ్బంది వసూళ్లు చేసి అధికారులకు వాటాలు ఇవ్వడంతో వారిపై ఈగ వాలకుండా కాపాడుకుంటున్నారు. అధికారులకు కిందిస్థాయి సిబ్బందికి సంబంధాలు బలంగా ఉండటానికి కారణం ఇదేనని తెలుస్తోంది. తాజా ఘటనతో అయినా వాణిజ్య పన్నుల శాఖలో మార్పు వస్తుందా అని వ్యాపార వర్గాల్లో చర్చ నడుస్తోంది.

సౌకర్యాలేవి సార్

(7వ పేజీ తరువాయి)

కనిపించకపోవడానికి లే అవుట్లలో కనీస వసతులు లేకపోవడమే కారణమని గృహనిర్మాణ సంస్థ అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఇటీవల కలెక్టర్ జిల్లాలోని పెనమలూరు, పామర్రు, అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లోని లే అవుట్లను పరిశీలించారు. ఈ సమయంలో లే అవుట్లలో ఇళ్లు నిర్మించుకుని అక్కడే నివాసం ఉంటున్నవారు తాము పడుతున్న ఇబ్బందులకు కలెక్టర్ ఎదుట ఏకరువు పెట్టారు. నూతనంగా నిర్మించిన కాలనీల్లో రహదారులు, విద్యుత్, తాగునీటి వసతులు కల్పించాలని కోరారు.

జిల్లాలోని లే అవుట్లలో పరిస్థితి ఇదీ..

జిల్లాలో గత ప్రభుత్వం ఏర్పాటుచేసిన లే అవుట్లలో అంతర్గత రహదారులు నిర్మించకపోవడంతో అక్కడ నివాసం ఉండేవారు ఇబ్బందులు పడుతున్నారు. ● రుద్రవరంలో ఏర్పాటుచేసిన రెండు లే అవుట్లలో సగానికి పైగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ఈ లే అవుట్లలో రూ.1.50 కోట్లతో మెరక పనులు చేసినట్లుగా చూపి గతంలో బిల్లులు చేసుకున్నారు. కానీ, పనులు సక్రమంగా చేయలేదు. ఇళ్ల మధ్య అంతర్గత రహదారులకు సంబంధించి పనులు చేయకపోవడంతో వర్షాకాలంలో ద్విచక్రవాహనం ఇంటి వరకు వెళ్లే అవకాశం కూడా లేకుండాపోయింది. ఇటీవల కలెక్టర్ ఈ కాలనీని పరిశీలించిన సమయంలో స్థానికులు తమ సమస్యలు చెప్పుకొన్నారు. ● గుండుపాలెం పంచాయతీ శివారు పల్లెపాలెంలో స్థలాలుగా ఇచ్చిన భూమి పల్లపు ప్రాంతంలో ఉంది. ఈ లే అవుట్‌లో మెరక పనులు సక్రమంగా చేయకుండానే వైసీపీ నాయకులు బిల్లులు చేసుకున్నారు. ● కరగ్రహారంలో లే అవుట్‌లో 16 వేల మందికి సెంటు భూమి చొప్పున స్థలాలు ఇచ్చారు. ఇక్కడ కూడా అంతర్గత రహదారుల పని ఒక్కటీ జరగలేదు. ● గన్నవరం మండలం కేసరపల్లి లే అవుట్‌కు వెళ్లేందుకు రూ.3 కోట్ల అంచనాతో వంతెన నిర్మిస్తామని రెండేళ్ల కిందట అధికారులు ప్రకటించారు. కానీ, ఇంతవరకు ఈ వంతెన పనులు ప్రారంభమే కాలేదు. ఇక్కడ ఎకరానికి రూ.70 లక్షలు చెల్లించి 60 ఎకరాలను కొని లే అవుట్ వేశారు. 3,400 మందికి స్థలాలు ఇచ్చారు. ఈ లే అవుట్‌కు వెళ్లేందుకు వంతెన నిర్మాణాన్ని మాత్రం పక్కన పెట్టేశారు. దీంతో ఇక్కడ ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు సరైన దారిలేక ఇబ్బందులు పడుతున్నారు.

టాస్క్ పూర్తిచేశాడు..!

(7వ పేజీ తరువాయి)

ఉంటుంది. నగరంలో కీలకమైన కేసుల దర్యాప్తు బాధ్యతలను ఈ విభాగానికే అధికారులు అప్పగిస్తారు.

ఆ ముగ్గురు బదిలీ

కొద్దినెలల క్రితం జి.కొండూరులో జరిగిన పేకాట శిబిరంపై దాడి చేసి పట్టుకోవడానికి ఒక బృందం అక్కడికి వెళ్లింది. ఆ సమయంలో ఈ బృందం వ్యవహరించిన తీరుపై భారీగా ఆరోపణలు వచ్చాయి. పేకాట శిబిరం నిర్వహణకు సంబంధించి అసలు సూత్రధారిని తప్పించారన్నది ప్రధాన ఆరోపణ. పేకాటరాయుళ్ల నుంచి స్వాధీనం చేసుకున్న మొత్తానికి, జి.కొండూరు పోలీసులకు అప్పగించిన మొత్తానికి మధ్య వ్యత్యాసం కూడా కనిపించింది. ఈ వ్యవహారాన్ని మొత్తం ముగ్గురు కానిస్టేబుళ్లు చక్కబెట్టారు. పేకాట విషయం, అక్కడ జరిగిన తతంగం మొత్తం బయటకు రావడంతో ఈ ముగ్గురు గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు తడుముకున్నారు. నాడు టాస్క్‌ఫోర్స్‌కు ఏడీసీపీగా పనిచేసిన అరిటాకుల శ్రీనివాసరావును వెంటబెట్టుకుని పోలీసు కమిషనర్ కార్యాలయానికి వెళ్లారు. తాము ఏ తప్పూ చేయకుండా బురద జల్లుతున్నారని అతి వినయాన్ని ప్రదర్శించారు. అప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోని పోలీసు కమిషనర్ తర్వాత విచారణ చేయించారు. ఈ ముగ్గురూ పేకాట శిబిరం వద్ద ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించారన్న వాస్తవాలు తెలిశాయి. దీంతో ఉన్నట్టుండి టాస్క్‌ఫోర్స్ నుంచి ఈ ముగ్గురిని తలో విభాగానికి బదిలీ చేశారు. ఒక కానిస్టేబుల్‌ను మహిళా పోలీస్‌స్టేషన్‌కు, మరో కానిస్టేబుల్‌ను ట్రాఫిక్‌కు, ఇంకో కానిస్టేబుల్‌ను సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ బదిలీని నిలుపుదల చేసుకోవడానికి త్రిమూర్తులు అనేక ప్రయత్నాలు చేశారు. అయినా చివరికి బదిలీ వేటు తప్పలేదు.

కులగణన చేయకుంటే ఉద్యమమే : రామకృష్ణ

మచిలీపట్నం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనగణనతో పాటు, కులగణన జరపకపోతే రానున్న రోజులలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మచిలీపట్నంలోని వేమూరి కల్యాణ మండపంలో శనివారం సీపీఐ నేతృత్వంలో జనగణనతోపాటు కులగణన చేయాలని, జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్‌లు కల్పించాలనే డిమాండ్‌తో బీసీ సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగణనతోపాటు ఆయా బీసీ కులాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంచనా వేయాలన్నారు. బీసీ సంఘాల జాతీయ అధ్యక్షుడు వెంగళరావు, సమావేశానికి అధ్యక్షత వహించిన నార్ల వెంకటేశ్వరరావు, బీసీసంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ప్రసంగించారు. సీపీఐ ఎన్టీఆర్‌జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, బీసీ నాయకులు బండారు ఆనందప్రసాద్, శాంతినాగరాజు, అందే జగదీష్ పాల్గొన్నారు.

మంత్రి రవీంద్ర అపార్ట్‌మెంట్ కోసం రోడ్లు విస్తరిస్తారా?: పేర్ని

మచిలీపట్నం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : చేపల మార్కెట్ సమీపంలో మంత్రి కొల్లు రవీంద్ర అపార్ట్‌మెంట్ కోసం పక్కనే రహదారులను విస్తరిస్తారా అని మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, మంత్రి అపార్ట్‌మెంట్‌కు ఇంత వరకు అనుమతులు లేవన్నారు. పోర్టు నిర్మాణ సంస్థ నుంచి సిమెంట్, కాంక్రీట్ తెచ్చి పనులు శరవేగంగా చేయిస్తున్నారని ఆరోపించారు. రహదారి అభివృద్ధి చేసేందుకు. తన అపార్ట్‌మెంట్ వద్ద తక్కువగా, మిగిలిన ప్రాంతంలో అధికంగా స్థలం సేకరించేందుకు కుట్ర చేశారన్నారు. రోడ్డు విస్తరణ పేరుతో ఇళ్లను, షాపులను ఖాళీ చేయిస్తున్నారని ఆరోపించారు.

పేర్ని నానికి మతిచెడింది

(7వ పేజీ తరువాయి)

వైసీపీ నాయకుల పాత్ర, ప్రభుత్వంపై చేసిన కుట్ర బయటపడుతుంటే పేర్ని నాని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. హోలోగ్రామ్, ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టమ్ రాష్ట్రంలో అమలు జరుగుతున్నప్పటికీ పేర్ని నాని అమలు జరగడం లేదని చెప్పడం హాస్యాస్పదమన్నారు. 2014-19లోనే హోలోగ్రామ్, ట్రాక్ అండ్ ట్రేస్ సిస్టమ్‌ను తీసుకొచ్చామని మంత్రి చెప్పారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ వ్యవస్థను మొత్తం నాశనం చేశారన్నారు. ఐదేళ్లుగా కల్తీ మద్యాన్ని ప్రజల నెత్తిన రుద్దారన్నారు. కల్తీ మద్యం అమ్మకాల కోసం ఏకంగా టార్గెట్లు పెట్టి మరీ తరలించారన్నారు. రాష్ట్రంలో రూ.99 మద్యం బ్రాండ్లు కూటమి ప్రభుత్వం ఆపేసిందని పేర్ని నాని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మద్యం షాపు నిర్వాహకులు పెట్టిన ఇండెంట్ ప్రకారమే మద్యం సరఫరా జరుగుతుందన్నారు. వైసీపీ హయాంలో పొరుగు రాష్ట్రాల నుంచి మద్యాన్ని తాగారని, ఇప్పుడా అవకాశం లేకుండా పోయిందన్నారు. ఏపీ సురక్ష యాప్ ద్వారా ప్రతి బాటిల్ స్కాన్ చేసుకుని చూడవచ్చన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని వివరించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

పామర్రు ఆస్పత్రి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

» ఎమ్మెల్యే కుమార్ రాజా

పామర్రు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పామర్రులో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. కూటమి నాయకులు ఆయన వెంట ఉన్నారు.


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

వెన్ననపూడి, పోలుకొండ విద్యార్థుల ప్రతిభ


వెన్ననపూడి పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

నందివాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ స్థాయి వాలీబాల్ వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపి వెన్ననపూడి జడ్పీ విద్యార్థులు ఆకునూరి ఆకాష్ బాబు, దొండాబత్తిన విజయ కుమార్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్.వై.మాధవకుమార్ తెలిపారు. పోలుకొండ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు అండర్-17 విభాగంలో వి.ఆమని, అండర్-14 విభాగంలో ఎం.షారోన్, డి.కార్తీక్ జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వి.మణి తెలిపారు. విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

ఆధునిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవాలి


గౌతమ్ కాన్సెప్ట్ స్కూల్‌లో విద్యార్థులు తయారు చేసిన..

గుడివాడ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు ఆకళింపు చేసుకోవాలని ఎంఈవో-2 బాలాజీ అన్నారు. గౌతమ్ కాన్సెప్ట్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన సందర్శించారు. ఎగ్జిబిషన్‌లో 300లకు పైగా వివిధ రకాల ప్రదర్శనలు నిర్వహించారు. ప్రదర్శనాంశాలు ఆకట్టుకున్నాయి. గౌతమ్ పాఠశాల మేనేజ్‌మెంట్ తదితరులు పాల్గొన్నారు.

పెదసనగల్లులో దీక్షా స్వాములకు ఇరుముడులు

కూచిపూడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెదసనగల్లు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అయ్యప్ప స్వాముల ఇరుముడుల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర, అయ్యప్పస్వాముల బంధుమిత్రులు పాల్గొన్నారు. అయ్యప్పస్వామి కీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ పురోహితులు, వేదపండితులు ఎమ్మెల్యే కుమార్ రాజాకు, వీరేంద్రకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు.

విద్యా సామగ్రి వితరణ


విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేస్తున్న దాత పూర్ణచంద్రరావు

పమిడిముక్కల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఐనపూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 143 మంది విద్యార్థులకు పెన్నులు, జామెంట్రీ బాక్స్‌లను దొడ్డా పూర్ణచంద్రరావు శనివారం పంపిణీచేశారు. అంగలూరు ప్రభుత్వ డైట్ కళాశాల అధ్యాపకుడు చండిక వేణుగోపాలరావు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఉద్బోధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు సాయం చేసి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం


వైద్యశిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ ప్రత్తిపాటి అశ్వర్థన్‌రావు, సీఈవో కుమారి

పెదపారుపూడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాటూరి నాగ వెంకట కృష్ణ విజ్ఞప్తి చేశారు. పాములపాడు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పాములపాడు సొసైటీ వారి ఆర్థిక సహాయంతో ఉచితంగా కళ్ల జోళ్లు అందజేస్తామన్నారు. వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అవసరమైన వారికి ఏలూరు ఆశ్రమం ఆసుపత్రి నందు ఆపరేషన్లు చేయిస్తామన్నారు. సర్పంచ్ ప్రత్తిపాటి అశ్వర్థన్‌రావు, సీఈవో కుమారి తదితరులు పాల్గొన్నారు.

నేత్ర వైద్య పరీక్షలు

గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. గుడివాడ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది 28 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు.

సైకిల్‌తో కాలుష్యానికి చెక్

» స్వచ్ఛతా కార్యక్రమంలో సైకిల్ ర్యాలీలు


గుడివాడలో ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్


తోట్లవల్లూరులో సైకిల్ ర్యాలీ చేస్తున్న ఎంపీడీవో రవికాంత్, పంచాయతీ సిబ్బంది


పెదపారుపూడిలో సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో విమాదేవి తదితరులు

గుడివాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సైకిల్ వినియోగంతో వాహన కాలుష్యానికి చెక్ పెట్టవచ్చని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం పురపాలక సంఘానికి ఆయన సైకిల్‌పై వచ్చి స్ఫూర్తిగా నిలిచారు. 17 మంది సైకిళ్లపై, 12 మంది వాకింగ్ చేసుకుంటూ కార్యాలయానికి వచ్చారు. వాకింగ్ లేదా సైకిల్‌పై కార్యాలయానికి రావడానికి అందరూ కృషి చేయాలన్నారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, అకౌంట్స్ అధికారి జి.టి నాయుడు, అసిస్టెంట్ టౌన్‌ప్లానర్ వి.ఏసుబాబు, సిబ్బంది పాల్గొన్నారు. **గుడివాడ రూరల్** : బాలకృష్ణ నగర్, పిన్నమనేని నగర్ ప్రాథమిక పాఠశాలల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని పర్యావరణ పరిరణ, స్వచ్ఛ కార్యక్రమాలను వివరించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. మోటూరు గురుకుల పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ గాలిపై ర్యాలీలు నిర్వహించారు. **పెదపారుపూడి** : కాలుష్యాన్ని నివారించటానికి ప్రజలందరూ సహకరించాలని ఎంపీడీవో విమాదేవి అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా పెదపారుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వ్యర్థాలను తగ్గించటం, ఇంధన వినియోగాన్ని తగ్గించటం చేసి కాలుష్య నియంత్రణకు మొక్కలు నాటాలని తెలిపారు. ఎంఈవో బి.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు బెజవాడ నాగమల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు. **తోట్లవల్లూరు** : మానవాళి మనుగడకు ప్రమాదకరంగా తయారైన వాహనాల పొగ కాలుష్యాన్ని నియంత్రించాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని, ఇందుకు సైకిల్ వినియోగమే శరణ్యమని ఎంపీడీవో రవికాంత్ అన్నారు. తోట్లవల్లూరులో శనివారం స్వర్ణాంధ్ర = స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా వాహన కాలుష్యాన్ని నియంత్రించాలని కోరుతు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు** : గాలి కాలుష్యాన్ని తగ్గించి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ అన్నారు. గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో స్వచ్ఛ గాలి నినాదంతో శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయితీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. వడ్లమన్నాడు, కట్టానిచెరువు, శేరిదగ్గుమిల్లి,డోకిపర్రు తదితర గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి సుబ్రహ్మణ్యం

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

గుడివాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవ అధికారి, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.సుబ్రహ్మణ్యం అన్నారు. పాటిమీద కళాక్షేత్ర మండపంలో అంకిత మహిళా మండలి సహకారంతో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రతి చర్యను గమనించాలన్నారు. కేసులు నమోదైనప్పుడు శిక్షలు అత్యంత కఠినంగా ఉంటాయని పిల్లలకు తెలియజేయాలన్నారు. అంకిత అధ్యక్షురాలు జి.బేబిసరోజని, స్వాతి మహిళా సంఘం వీవో నవీన్, అంకిత ప్రాజెక్టు మేనేజర్ టి.అరుణకుమారి, సభ్యులు టి.నాగమణి, లక్ష్మీ, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్, జీఎస్టీ శాఖల ఆధ్వర్యంలో

పీఎం సూర్యఘర్ అవగాహన ర్యాలీ

గుడివాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : ఏపీ సీపీడీసీఎల్ ఎస్ఈ ఎం.సత్యానందం, కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలో విద్యుత్, జీఎస్టీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పీఎం సూర్యఘర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈఈ జి.బి శ్రీనివాసరావు, డీఈఈ బి.నాగబాపి రాజు, జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సునీత, జీఎస్టీవో బదరీనాథ్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నేడు

గుడివాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో కోతిబొమ్మ సెంటర్‌లోని డాక్టర్ ప్రభావతి గార్డెన్స్‌లో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కన్వీనర్లు డాక్టర్ సి.సూర్యచంద్రరావు, గుళ్లపల్లి కిరణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ తిపిర్నేని లక్ష్మీపెరుమాళ్లు ప్రభావతి, చలసాని రాయన్‌చౌదరి జ్ఞాపకార్థం డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల వైద్యులు గుండె, నరాల సంబంధిత సమస్యలపై వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తారన్నారు.

రహదారి అభివృద్ధికి సర్వే

గుడ్లవల్లేరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జేమ్స్‌పేట నుంచి కట్టానిచెరువు, పురిటిపాడు వరకూ ఆర్ అండ్ బి రహదారి అధ్వానంగా ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో శనివారం అధికారులు సర్వే నిర్వహించారు. అంచనాలు రూపొందించి అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రహదారి అభివృద్ధిపై దృష్టి పెట్టడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా, నన్నపనేని తదితరులు

పేద వర్గాలకు గొప్ప వరం

జీఎస్టీ సంస్కరణలు

కూచిపూడి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వర్గాలకు జీఎస్టీ సంస్కరణలు ఎంతగానో మేలు చేస్తున్నాయని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో పెదసనగల్లులో నిర్వహించిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ముందు చూపు కారణంగా జీఎస్టీ సంస్కరణల వల్ల అన్ని వర్గాల ప్రజలకు లాభం కలుగుతుందని తెలిపారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కరపత్రాలు ఆవిష్కరించారు. బైక్ ర్యాలీ జరిగింది. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, ఉయ్యూరు ఆర్టీవో సుబ్బారావు, ఎంవిఐ అయేషా, కూటమి నేతలు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్టీతో పెరిగిన కొనుగోలు శక్తి

● **తోట్లవల్లూరు** : జీఎస్టీ తగ్గింపుతో ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగిందని తోట్లవల్లూరు మండల టీడీపీ క్లస్టర్ హెడ్-1 కొత్తపల్లి కిరణ్ అన్నారు. తోట్లవల్లూరులో శనివారం కిరణ్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. జీఎస్టీ తగ్గింపుపై పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి బలంగా తీసుకెళ్ళాలని ఆయన కోరారు. మండల తెలుగురైతు అధ్యక్షుడు నెక్కలపూడి మురళీ, మాజీ ఉప సర్పంచ్ చిరుమామిళ్ళ మోహన్‌మంజు, తదితరులు పాల్గొన్నారు.

15 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు

గుడివాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు పేదవర్గాల ఉన్నతికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సోదరుడు వెనిగండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. ప్రజావేదికలో నియోజకవర్గ పరిధిలోని 15 మంది బాధిత కుటుంబాలకు రూ.12 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సుమారు రూ.3.90 కోట్లు అందించినట్లు తెలిపారు. స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ఆకట్టుకునే విధంగా బోధన చేయాలి

గుడివాడ రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు కాంప్లెక్స్‌ల్లో నేర్చుకున్న విషయాలు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈవో -1 రజనీ అన్నారు. మోటూరు స్కూల్ కాంప్లెక్స్ శిక్షణా తరగతుల్లో ఎంఈవో రజనీ మాట్లాడారు. ప్రతి అంశాన్ని విద్యార్థులకు అవగాహన కలిగేలా చెప్పాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు కుటుంబసభ్యులు మాదిరిగా మెలగాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. మోటూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టుకు పీటర్సన్ ఎంపిక

గుడ్లవల్లేరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ డివిజన్ వాలీబాల్ జట్టు ఎంపిక గుడివాడలో నిర్వహించారు. కాగా డివిజన్‌లో 12 మండలాల విద్యార్థులకు నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో తమ 9వ తరగతి విద్యార్థి పీటర్సన్ ఎంపికయ్యాడని ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ గుడ్లవల్లేరు ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపాల్ కుంజుమన్ తెలిపారు. గుడివాడ డివిజన్ వాలీబాల్ జట్టుకు 9 మందిని ఎంపిక చేయగా వారిలో తమ విద్యార్థి పీటర్సన్ ఎంపికవావడం అభినందనీయమన్నారు. జట్టు 2025-26 సంవత్సరంలో డివిజన్ తరఫున ఆడే పోటీల్లో పీటర్సన్ ఆడతారని తెలిపారు. ఈ నెల 21 న ఈ టీమ్ జిల్లా టీమ్ ఎంపికలో ఆడనున్నారని అందులో విజేతలైతే జిల్లా టీమ్‌కు ఎంపికవుతారని కుంజుమన్ తెలిపారు. పీటర్సన్‌ను అతనికి తరిఫీదు ఇచ్చిన పిఈటి భూపాల్ రెడ్డి, రాధ లను పాఠశాల యాజమాన్యం, డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ జి.ఎం.సత్యబాబు లు అభినందించారు.


డివిజన్ టీమ్‌కు ఎంపికైన గుడ్లవల్లేరు ఏఏఏన్ఎం విద్యార్థితో ఉపాధ్యాయులు

శిక్షాత్మక విజిలెన్స్ కంటే నివారణ విజిలెన్స్‌కు ప్రాధాన్యం

గుడివాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : శిక్షాత్మక విజిలెన్స్ కంటే నివారణ విజిలెన్స్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ గుడివాడ బ్రాంచ్ మేనేజర్ కాకరాల శ్రీనాథ్ తెలిపారు. శనివారం స్థానిక ఎఎన్ఆర్ కళాశాలలో నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ భారత ప్రభుత్వం తరఫున సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ మార్గదర్శకాల ప్రకారం విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిలెన్స్ గురించి, అవినీతి నిరోధానికి సంబంధించిన నిబంధనలు, పద్ధతులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు అవినీతి నిర్మూలన, నిజాయితీ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తూ వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ విశాఖపట్నం మేనేజర్ సి.హెచ్ రాజేష్, కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డా.పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదానం అభినందనీయం

గుడివాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : అన్నదానం నిర్వహించడం అభినందనీయమని వేంకటేశ్వర స్వామి దేవస్థానం, భీమేశ్వరస్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్లు లింగం చిట్టిబాబు, పట్టపు చిన్నారు అన్నారు. ధనియాలపేటలోని ప్రణావాశ్రమం బాలక్షేత్రాలయ వసతి గృహంలో కాపవరపు అరుణకుమారి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, కోడలు ప్రసాద్, జ్యోతిర్మయి అన్నదానం నిర్వహించారు. డి.సీతామహాలక్ష్మీ, డిఆర్‌బి ప్రసాద్, డి.వి సత్యనారాయణ, లక్ష్మీనారాయణ రెడ్డి, మోహనరావు, లంకపల్లి లాజర్, పల్లపు అనీల్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ వెంకట లక్ష్మికి సత్కారం

గుడివాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : రాజేంద్రనగర్‌లోని బాలవిహార్ స్కూల్‌లో శనివారం అప్సా రాష్ట్ర సభ్యుడు మాదాసు సత్యనారాయణ ఆధ్వర్యంలో అప్సా ఐకాన్ అక టడమిక్ అవార్డు గ్రహీత గండెం వెంకటలక్ష్మిని ఘనంగా సత్కరించారు.వెంకటలక్ష్మి విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసిన తీరు ప్రశంసనీయమన్నారు. ఉపాధ్యాయలు పాల్గొన్నారు.



వాయు, శబ్ద కాలుష్య రహిత సమాజం నిర్మిద్దాం : కలెక్టర్


మచిలీపట్నం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వాయు, శబ్ద కాలుష్య రహిత సమాజం నిర్మాణంలో భాగస్వాములవుదామని కలెక్టర్ బాలాజీ పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలు నుంచి కోనేరుసెంటర్, మూడు స్తంభాల సెంటర్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం పరిధిలో చెత్తను తొలగించే కార్యక్రమంలో పాల్గొన్నారు. పశు సంవర్థక శాఖాధికారి చిన నరసింహులు, డీఆర్వో చంద్రశేఖరరావు, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ పోతురాజు, డ్వామా పీడీ శివప్రసాద్ యాదవ్, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ ఆర్.వెంకట్రావు పాల్గొన్నారు. మూడు స్తంభాల సెంటర్‌లో అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ బాలాజీ సందర్శించారు. టిఫిన్ చేశారు. తన కార్యాలయానికి సైకిల్‌పై వెళ్లారు. **మచిలీపట్నం టౌన్ :** పెదకానూరులో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో


అన్నక్యాంటీన్‌లో టిఫిన్ చేస్తున్న కలెక్టర్

జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, శ్రీహరి, దివి మహేష్, పీత రాము, పెద్ద ఏడుకొండలు, మోపిదేవి కృష్ణమూర్తి, బొట్ల రాజేష్, విజయ్ పాల్గొన్నారు. **ఘంటసాల :** కొడాలిలో నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు మొక్కలను నాటి ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ చలపాటి రాణి, తుమ్మల శంకరరావు, నాగమణి పాల్గొన్నారు. ఘంటసాలపాలెంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేశ్వరరావు గ్రామస్థులచేత ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ దోనె రజని, అర్జునరావు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మొక్కలు నాటారు. తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ప్రత్యేకాధికారి సాయిబాబు, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, శేషగిరి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, యలవర్తి చిన్నా పాల్గొన్నారు. **మోపిదేవి :** మండల కార్యాలయం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, పెదప్రోలులలో మొక్కలు నాటి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈవో శ్రీరామవరప్రసాదరావు, సర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, కార్యదర్శి రామకోటేశ్వరరావు ఉన్నారు.

మహిళపై దాడి కేసులో ఎనిమిది మంది అరెస్టు

బంటుమిల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పెదతుమ్మిడి గ్రామానికి చెందిన బొల్లా నరసమ్మ (61)పై దాడి చేసిన సంఘటనలో కారు డ్రైవర్‌తో సహా ఎనిమిది మంది నిందితులను ఎస్సై గణేష్ కుమార్ అరెస్టు చేశారు. సీసీ కెమెరాల సహాయంతో కారును, నిందితులను గుర్తించి, దాడి చేయించిన చిట్టబొమ్మ నాగముసీంద్రరావు, దాడి చేసిన అరుగురు మహిళలు, కారు డ్రైవర్‌ను అరెస్టు చేసి బంటుమిల్లి కోర్టులో హాజరుపర్చారు.



నేత్ర పరీక్షలు

చల్లపల్లి : డాక్టర్ వెంకట్రావ్ 45 మందికి కంటి పరీక్షలు చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ముమ్మనేని నాని, ప్రతినిధులు పాల్గొన్నారు.



కమ్మవారిపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా సబ్బినేని



నాగాయలంక, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కమ్మవారిపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా సబ్బినేని వెంకటేశ్వరరావు (అబ్బాయి), సభ్యులుగా వల్లభనేని సదాశివరావు, విశ్వనాథపల్లి నరసింహారావు, ఏటిమొగ పీఏసీఎస్ ఛైర్మన్‌గా ఒడుగు నాగరాజు, సభ్యులుగా అమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, సైకం బుజ్జిబాబును నియమించినట్లు సీఈవో కె.వి.రామాంజనేయులు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560



















